neelagirivartha@gmail.com

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త

తెలుగు దిన పత్రిక

NEELAGIRI VARTHA TELUGU DAILY

తెలంగాణ ఎడిటర్ : గుంటోజి విష్ణుమూర్తి, 11 ఆదివారం అక్టోబర్ 2026 సంపుటి : 15 సంచిక :367 పేజీలు 12 వెల : 5/-

## ‘ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి’.. ప్రధాని మోదీకి రాహుల్ సవాల్!

- ప్రధాని మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరిన రాహుల్ గాంధీ చీఫ్‌ల లక్షణం పిరికితనం అని వ్యాఖ్య
- సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విపక్షాల నిరసనల నేపథ్యంలో వ్యాఖ్యలు
- రాజ్యాంగాన్ని కాపాడటమే తమ లక్ష్యమని వెల్లడి



## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు

- గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి
- ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని వెల్లడి

తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరిం చారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రే షన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శ నమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా స్పందిం చారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. ...మిగతా 2 లో...

## హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

- భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి
- ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన
- ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి

## కాంగ్రెస్ ‘ఓటు చోరీ’ ఆరోపణలను తిప్పికొట్టండి: బీజేపీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు

- ఎన్నికల కమిషన్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందన్న రాంచందర్ రావు
- వరుస ఓటములతోనే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శ
- రాజ్యాంగబద్ధ సంస్థలపై బురద చల్లుతున్నారని మండిపాటు

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ‘ఓటు చోరీ’ ఆరోప ణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ (ఈసీ) పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, మీడియా ప్యానలిస్టులతో జరిగిన సమా వేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. దొంగ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు.

## రిగ్గింగ్ ఆధారాలుంటే చూపండి..!

## ఈసీకి మద్దతుగా మాజీ ఉన్నతాధికారుల ఘాటు లేఖ

- ఎన్నికల సంఘానికి మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు
- రిగ్గింగ్ ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని స్పష్టీకరణ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరచవద్దని హితవు



## నాగర్‌కర్నూల్ జిల్లా లో కల్లు దుకాణాలకు తాళాలు

నీలగిరి వార్త

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం గ్రామంలో కల్లు ధరల పెంపుపై గ్రామస్తుల ఆగ్రహం. ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్నారంటూ కల్లు దుకాణాలకు తాళాలు వేసిన గ్రామస్తులు. గతంలో రూ. 10 ఉన్న కల్లు సీసా ధర.. గత ఏడాది రూ. 13కు పెంపు. తాజాగా మరోసారి రూ. 15కు పెంచడంతో గ్రామస్తుల అసంతృప్తి. ప్రతి ఏటా ధరలు పెంచితే సామాన్యులు ఎలా భరించాలని ప్రశ్నించిన గ్రామస్తులు. కల్లు ధరల పెంపుతో కూలీలు, రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్నామని వెల్లడి ధరలు తగ్గించాలని గ్రామ పెద్దల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన గ్రామస్తులు. కల్లు దుకాణదారులతో మాట్లాడి ధరలు తగ్గించాలని సూచించిన గ్రామ పెద్దలు. ధరల విషయంలో అసంతృప్తి కొనసాగడంతో దుకాణాలకు తాళాలు వేసి నిరసన. ధరలు తగ్గించకుంటే దుకాణాలు తెరవడానికి అనుమతించబోమని హెచ్చరిక కల్లు ధరలపై సంబంధిత అధికారులు స్పందించి, ధరల నిర్ణయంపై విచారణ చేపట్టాలని డిమాండ్ సమస్య పరిష్కారమయ్యే వరకు తమ నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేసిన గ్రామస్తులు ఈ నిరసనలో గ్రామ పెద్దలు నాగయ్య, దశరథం, బోనాసి కుర్మయ్య, మల్లికార్జున్, ఆర్మీ వెంకటయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.




## ధ్రువ్ రాఠీని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఢిల్లీలో హై అలర్ట్..!

- ధ్రువ్ రాఠీని గురుగ్రామ్‌లోని తన నివాసంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- శనివారం ఉదయం 8 గంటలకు ఈ ఘటన జరిగినట్లు సీజేపీ వెల్లడి
- జంతర్‌మంతర్ వద్ద సీజేపీ నిరసనలో పాల్గొనేందుకు వెళ్లనున్న నేపథ్యంలో చర్యలు
- ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా బెంగళూరులోనూ నిరసనలో పాల్గొన్న రాఠీ
- ఢిల్లీ సరిహద్దుల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనకు సిద్ధమవుతున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ధ్రువ్ రాఠీని గురుగ్రామ్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు ఈ మేరకు అరెస్ట్ చేసినట్లు ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సీజేపీ) ‘ఎక్స్’ ఖాతాలో పేర్కొంది. అయితే, ఆయనను అదుపులోకి తీసుకోవడానికి గల కారణాలపై స్పష్టత లేదు. ...మిగతా 2 లో...

## ‘ప్రభుత్వానికి భయం పట్టుకుంది’.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్



- ఢిల్లీలో ఆంక్షలు విధించడంపై కాంగ్రెస్ అభ్యంతరం
- యువత నిరసన హక్కును అడ్డుకుంటున్నారని ఆరోపణ
- మోదీ, అమిత్ షాలపై ప్రియాంకా విమర్శలు
- ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలన్న జైరాం రమేశ్
- ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని కాంగ్రెస్ డిమాండ్

## బతుకమ్మ వేడుకలకు ఇబ్బంది లేకుండా చర్యలు

నీలగిరి వార్త.

కమాన్ పూర్ మండలం పేరా పల్లి గ్రామంలో బతుకమ్మ వేడుకలకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందని గ్రామ సర్పంచ్ బొంగుని సయ గౌడ్ తెలిపారు. బతుకమ్మ పండుగ వేడుకల సందర్భంగా గ్రామంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సర్పంచ్ బొంగోని సదయ్య ప్రత్యేక చర్యలు చేపట్టారు. వీధులన్నింటిలో కొత్త వీధి దీపాలు అమర్చే పనులను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. పండుగ వేళ గ్రామంలో విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తున్నామని, ప్రజలంతా సంతోషంగా బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని కోరారు.



## సీఈసీ వివాదం...

### ప్రతిపక్షాల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి

- 13 కోట్ల ఓట్ల తొలగింపు ఆరోపణలు అవాస్తవమన్న వెంకయ్యనాయుడు
- ఓడిపోతే ఈవీఎంలను నిందించడం హాస్యాస్పదమని వ్యాఖ్య
- ప్రతిపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని విమర్శ

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందించారు. విపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయని, రాజ్యాంగబద్ధ సంస్థలను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరికాదని ఆయన హితవు పలికారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారంటూ వస్తున్న ఆరోపణలు కేవలం అపోహ మాత్రమేనని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలతో సీఈసీ, ప్రధానమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సమంజసం కాదన్నారు.



# కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు.. రైతులకు ఇబ్బందులు!

## తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా, లో వోల్టేజ్‌తో మోటార్లు కాలిపోతున్నాయి: బి ఆర్ఎస్ మండల నాయకులు మైలపల్లి వెంకటేశ్వర్లు

## రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్

**నీలగిరివార్త /అక్టోబర్ 10/నల్గొండ జిల్లా ప్రతినిధి :శంకర్**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బి ఆర్ఎస్ మండల నాయకులు మైలపల్లి వెంకటేశ్వర్లు విమర్శించారు. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా కావడం లేదని, ప్రభుత్వం రైతులకు తొమ్మిది గంటల పాటు మాత్రమే కరెంటు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు.లో వోల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు సరిగా పనిచేయకపోవడంతో పాటు, కొన్ని సందర్భాల్లో మోటార్లు కాలిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతూ, పంటలకు నీరు అందించడంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒక వైపు ఎల్ నినో తో రైతులు వర్షాలు పడక ఇబ్బంది పడుతూ ఉన్నారు వ్యవసాయానికి నిరంతరాయంగా, నిర్ణీత సమయంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, మోటార్లు కాలిపోవడం వల్ల నష్టపోతున్న రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మైలపల్లి వెంకటేశ్వర్లు కోరారు.



# ఐలాపురం, తోపుచెర్ల గ్రామాల చెరువులను నింపేందుకు ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ప్రత్యేక చొరవ

**నీలగిరి వార్త /అక్టోబర్ 10/నల్గొండ జిల్లా ప్రతినిధి :శంకర్**

సాగర్ ఎడమ కాలువ ద్వారా తాగునీటిని విడుదల చేసిన నేపథ్యంలో ఐలాపురం, తోపుచెర్ల గ్రామాల చెరువులను డి-30 కాలువ ద్వారా నింపేందుకు ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఈ సందర్భంగా రైతులతో కలిసి కాలువ వద్దకు వెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామాల చెరువులకు నీటిని విడుదల చేసి నింపేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో పర్యటిస్తూ రైతుల సమస్యలను తెలుసుకుని, గ్రామాల తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు చెరువుల్లో నీరు నిల్వ ఉండేలా కృషి చేశారు.రైతులకు, గ్రామ ప్రజలకు నీటి కొరత తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి చెరువులను నింపాలని ఎమ్మెల్సీ సూచించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూర్య, స్థానిక రైతులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# దేవరకొండలో బతుకమ్మ సంబరాలు

## బతుకమ్మలతో బయలుదేరిన మహిళలు

## దేవాలయాలలో బతుకమ్మలు పేర్చి ఆడిన మహిళలు





**దేవరకొండ నీలగిరి వార్త**

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబమైన బతకమ్మ సంబరాలు శనివారం ఎంగిలి పువ్వు బతుకమ్మతో ప్రారంభం కాక దేవరకొండ పట్టణంలో దేవాలయాలలో తీరక్క పువ్వులతో తీసుకువచ్చిన బతుకమ్మలతో మహిళలు సందడి చేశారు. పట్టణంలోని శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో అందమైన బతుకమ్మలను పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల ...బంగారు బతుకమ్మ ఉయ్యాలో... అంటూ తెలంగాణ సాంస్కృతిని చాటుతూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడి పాడిన దృశ్యాలు పువ్వుల మకరందాన్ని విరజిల్లాయి. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన మహిళలు మాట్లాడుతూ. ప్రకృతితో ముడిపడి పువ్వులతో కొలిచే పండగ బతుకమ్మ అని అన్నారు. మహిళలు ఎంగిలిపువ్వు బతుకమ్మతో మొదలై సజ్జల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులు సాంప్రదాయాల తో పండగ వాతావరణం లో బతుకమ్మలను కొలుస్తారని పేర్కొన్నారు. వందలాదిగా బతుకమ్మలను తీసుకొచ్చిన మహిళలు ఆద్యంతం భక్తి పరవశంతో బతుకమ్మ పాటలతో ఆడి పాడారు .ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు: రూరల్ ఎస్సై మల్లికంటి లక్ష్మయ్య

**నీలగిరి వార్త/ అక్టోబర్ 10 / నల్గొండ జిల్లా ప్రతినిధి/ శంకర్**

మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత -- కేసులు నమోదు శనివారం ఉదయం తక్కెళ్లపాడు గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తమై తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా తక్కెళ్లపాడు గ్రామ శివారులోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ సమీపంలో,ఉట్లపల్లి గ్రామ సెంటర్ వద్ద మిర్యాలగూడ వైపు ఇసుకతో వస్తున్న రెండు ట్రాక్టర్లను మా పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించి ఆపి తనిఖీ చేశారు. వాటిలో ఒక ట్రాక్టర్ నంబర్ టూ 05 ఖఫీ 6617 కాగా, మరొక ట్రాక్టర్‌కు రిజిస్ట్రేషన్ నంబర్ లేదు. ఇసుక రవాణాకు సంబంధించిన అనుమతి పత్రాలను అడగగా, వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేవని తేలింది.విచారణలో ట్రాక్టర్ల డ్రైవర్లు యజమానుల వివరాలు శ్రీరాముల లింగయ్య, నివాసం కామేపల్లిగూడెం, జిల్లబోయిన దేవయ్య, నివాసం తడకమళ్లగా గుర్తించాం. అనంతరం రెండు ట్రాక్టర్లను ఇసుకతో సహా పోలీస్ స్టేషన్‌కు తరలించి, సంబంధిత డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాం.

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ రూరల్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.





# మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌డీపీఓ జి. రవి

## పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

## ఆధునిక సాంకేతికతతో నేరాల గుర్తింపు.. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సూచనలు





**నీలగిరి వార్త/ అక్టోబర్ 10/ నల్గొండ జిల్లా ప్రతినిధి: శంకర్**

వార్షిక తనిఖీల్లో భాగంగా మిర్యాలగూడ సబ్ డివిజన్ ఎస్‌డీపీఓ జి. రవి మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రతి కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టి నేరాలను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఎస్‌డీపీఓ సూచించారు. నేరాల నియంత్రణ, గుర్తింపు కోసం గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.తనిఖీల సందర్భంగా పోలీస్ సిబ్బంది సంక్షేమం గురించి అడిగి తెలుసుకున్న ఆయన, విధుల నిర్వహణలో అవసరమైన మార్గదర్శకాలు అందించారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదుల కోసం వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా, గౌరవంగా వ్యవహరించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటడం కూడా ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, నేరాల నియంత్రణకు సమర్థవంతంగా పనిచేయాలని ఎస్‌డీపీఓ జి. రవి సిబ్బందికి సూచించారు.

# బీసీల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## ఐతవరంలో రూ.1.40 కోట్లతో రెండు కమ్యూనిటీ భవనాలకు శంకుస్థాపన.. బీసీలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుంది: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నీలగిరి వార్త/**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ: బీసీల అభ్యున్నతికి, సామాజిక గౌరవానికి, అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు అండగా నిలుస్తూ, వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని ఆమె స్పష్టం చేశారు.నందిగామ మండలం ఐతవరం గ్రామంలో బీసీ ఒడియా రాజుల కాలనీతో పాటు రామాలయం వద్ద సీజీఎఫ్ నిధులతో ఒక్కొక్కటి రూ. 70 లక్షల వ్యయంతో, మొత్తం రూ. 1.40 కోట్లతో నూతనంగా నిర్మించనున్న రెండు కమ్యూనిటీ భవనాలకు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ శ్రీ నెట్టెం రఘురాం, మాజీ మంత్రివర్యులు శ్రీ వసంత నాగేశ్వరరావు, మైలవరం శాసనసభ్యులు శ్రీ వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కూటమి నాయకులు, అధికారులు కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.బీసీలు సామాజికంగా,ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. . ఎన్టీఆర్ ఆశయాల బాటలో బీసీలకు టీడీపీ అండ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా గంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు.ఐతవరం గ్రామంలో ఒకేసారి రెండు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ. 1.40 కోట్ల నిధులతో శ్రీకారం చుట్టడం ఆయా ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ, ప్రతి వర్గానికి అండగా నిలవడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటెక్ నల్గొండ జిల్లా చాప్టర్ కు పూల మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన జర్నలిస్టులు

**దేవరకొండ నీలగిరి వార్త**

భారతీయ జాతీయ కళా సంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇన్ టాక్) నల్లగొండ జిల్లా కన్వీనర్ లయన్ సముద్రాల ధనంజయ ఎన్నికై మొట్టమొదటిసారి దేవరకొండకు విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆయన కు దేవరకొండ జర్నలిస్టులు పూల మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు మునిని అంజన్ మాట్లాడుతూ సముద్రాల ధనంజయ ఇన్ టాక్ కన్వీనర్ గా ఎన్నిక కావడం దేవరకొండ కే గర్వకారణమని తెలిపారు. వారసత్వ సంస్కృతిక పరిరక్షణ బలోపేతం చేయడంతో పాటు దేవరకొండ ఖిల్లా దుర్గం చారిత్రక విషయాలను ఆయన ఆధ్వర్యంలో వెలుగులోకి తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలోని చారిత్రక సాంస్కృతిక వారసత్వ కళా పరిరక్షణకు ఆయన మరింత కృషి చేయాలని మరిన్ని చారిత్రక ప్రదేశాలను వెలులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూల మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పగిడిమర్రి యాదగిరి బత్తుల సురేష్ లు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే విధుల నుండి తొలగించాలి

**టీ ఎన్ టీ యూ సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి డిమాండ్.**

**నీలగిరి వార్త,హుజూర్ నగర్**

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు చేస్తున్న ఆందోళనలను అణచివేయడానికి అరెస్టులు,ఇతర నిర్బంధ చర్యలకు పాల్పడటం సరైన విధానం కాదని శీతల రోషపతి అన్నారు.ప్రజల నిరసనలను అణచివేయాలని ప్రయత్నించినంత మాత్రాన ప్రజల అసంతృప్తిని ఆపలేరని అన్నారు.ప్రజల ఓట్లను తొలగించే అధికారం జ్ఞానేష్ కుమార్ కు ఎవరిచ్చారని ప్రశ్నించారు.దేశవ్యాప్తంగా దాదాపు 20 కోట్ల ఓట్లను తొలగించారన్న ఆరోపణలపై సమగ్ర వివరణ ఇవ్వాలని రోశపతి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు కీలకమని,అర్హులైన ఓటర్ల ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని అన్నారు.ఓటర్ల జాబితాలో మార్పుల పేరుతో అర్హులైన భారతీయ పౌరుల ఓటు హక్కుకు నష్టం కలిగించకూడదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా సంబంధిత అధికారులు వ్యవహరించాలని శీతల రోషపతి అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు,ఎన్నికల నిర్వహణపై ప్రజల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తిని ప్రభుత్వం సత్వరమే గుర్తించి తగిన చర్యలు తక్షణమే తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో వెంకన్న,రాజేష్, నాగరాజు,నాగమణి,స్వరూప తదితరులు పాల్గొన్నారు.



## దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు అంతా సిద్ధం..

**నీలగిరి వార్త,**



దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు జరిగే దేవి శరన్నవరాత్రి ఉత్సవాల కోసం ఆలయాలు అంతా సిద్ధం చేసి ఉన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా దగ్గర ఉండి మంట పాలను ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి విగ్రహం కూడా తీసుకొని రావడం జరిగింది. అలాగే కౌకుంట్ల మండల కేంద్రంలో కూడా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మంట పాలను అన్ని అంగులతో ఏర్పాటు చేసి సిద్ధంగా ఉంచారు. ఈ ఉత్సవాల కార్యక్రమం లో ప్రజలు అందరు కూడా అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

## హరిద్ర అలంకారంలో దర్శనమిచ్చిన స్వయం వ్యక్త శ్రీ కనకదుర్గాదేవి

**శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనంతో పరవశించి మైమరిచిన భక్తులు.**

**నీలగిరి వార్త,హుజూర్ నగర్**

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో స్వయంగా వెలిసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి కోవెల దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా,రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.



శనివారం భద్ర పద బహుళ అమావాస్య కావడంతో శ్రీ కనకదుర్గ అమ్మవారిని ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా హరిద్ర దేవిగా అలంకరించారు. ప్రాతఃకాల సమయము నుండి అమ్మకు పంచసూక్తాలతో, పంచామృతాలతో,విశేష సుగంధ పరిమళాలతో అభిషేకములు,భక్త శిఖామణులచే లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం,విశేష పూజలు అర్చకులు నరగిరినాధుని రంగభట్రాచార్యులు నిర్వహించారు.హరిద్రా స్వరూపంలో అమ్మవారిని సేవించటం ద్వారా దరిద్రం తొలగి,అష్టైశ్వర్య లక్ష్మీ కటాక్షం సిద్ధిస్తుందని,స్త్రీలకు సౌభాగ్యం పెరుగుతుందని,ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని అర్చకులు మోహనవంశీ తెలిపారు.ప్రదోషకాల సమయంలో శ్రీ కనకదుర్గ అమ్మవారిని భక్తులు విశేషంగా దర్శించుకున్నారు.విశేష పూజలతో పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీ అన్నమయ్య భజన బృందం వారు ఆలపించిన భక్తి భజన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.భక్తుల సౌకర్యార్థం కనకదుర్గ సేవా సమాజం నిర్వాహకులు బాచిమంచి వెంకటేశ్వర శర్మ,బాచిమంచి అనంతలక్ష్మి దంపతులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు.ఇట్టి కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని ఆలయ కమిటీకి సహకరించి తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు.

## సూర్యలంకలో అలల బీభత్సం: ఇద్దరు గల్లంతు

**ముగ్గురికి తప్పిన ప్రమాదం - భద్రతా వైఫల్యంపై విమర్శలు**

**నీలగిరి వార్త,**

శనివారం ఉదయం బాపట్ల సూర్యలంక బీచ్‌లో విషాదం చోటుచేసుకుంది. సముద్రంలో అలల తాకిడికి ఇద్దరు యువకులు కొట్టుకుపోయి గల్లంతయ్యారు. గల్లంతైన వారిని గుర్తించారు.అదే సమయంలో అలల్లో చిక్కుకుని కొట్టుకుపోతున్న మరో ముగ్గురు వ్యక్తులను అక్కడే ఉన్న ఇద్దరు వంశీ, కనకరాజుగా ధైర్య సాహసాలతో కాపాడారు. వారిలో ఒక వ్యక్తి ఎక్కువగా నీరు తాగడంతో అపస్మారక స్థితికి చేరగా, స్థానికులు వెంటనే సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు.అంబులెన్స్ కరువు – ఆటోలోనే ఆసుపత్రికి:బీచ్ వద్ద అంబులెన్స్, సౌకర్యం లేకపోవడంతో గాయపడిన వ్యక్తిని తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలో బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ఖాళీగా అవుట్ పోస్ట్ – పట్టించుకోని యంత్రాంగం: ఉదయం 8. 15 నిమిషాలు వరకు బీచ్‌లో పర్యాటకులకు హెచ్చరికలు చేసే అవుట్ పోస్ట్ ఖాళీగా ఉంది. పర్యాటకులను అప్రమత్తం చేయడానికి సిబ్బంది ఎవరూ లేకపోవడంపై స్థానికులు, పర్యాటకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మెరైన్ పోలీస్ వారు వాచ్ టవర్ మీద ఉండి పర్యవేక్షిస్తున్నారు. బీచ్‌లో తగిన భద్రతా చర్యలు, ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## యర్రగుంటపల్లి పీహెచ్‌సీలో ఘనంగా ‘సేవా సంకల్ప అభియాన్’ వైద్య శిబిరం!

**కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన కల్పించిన మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్.ఏ. ప్రసాద్!**

**యర్రగుంటపల్లి అక్టోబర్ 10 ప్రజాక్రాంతి:**

ఏలూరు జిల్లా యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తేలేసోమవారం గ్రామం నందు ‘సేవా సంకల్ప అభియాన్’ వైద్య శిబిరాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి ఎన్. గీత పాల్గొని... అసంక్రమిత వ్యాధులు, న్యూట్రిషన్, గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షల ఆవశ్యకత, కాన్సర్ స్క్రీనింగ్, బి.పి., షుగర్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు.అదేవిధంగా, చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్.ఏ. ప్రసాద్ విచ్చేసి... డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా మరియు బోధవ్యాధి వంటి కీటక జనిత వ్యాధుల నివారణపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించారు.ఈ వైద్య శిబిరంలో ఎం.ఎల్.హెచ్.పి. సి.హెచ్. షర్మిల, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె. శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు ప్రమీల, భూలక్ష్మి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## పెద్దల పండుగ సందర్భంగా నిరుపేదలకు చీరల పంపిణీ..

**నీలగిరి వార్త,**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య మేడిశెట్టి మాధవి గిరి శంకర్ దంపతులు శనివారం రోజు పెద్దల పండుగ ను పురస్కరించుకొని స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద నిరుపేద వృద్ధ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. పెద్దల పండుగ సందర్భంగా మా పూర్వీకులను గుర్తుచేసుకుని వారి జ్ఞాపకార్థం నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశామని ఈ సందర్భంగా వారు తెలిపారు. పిత్రు పక్షాల సందర్భంగా పూర్వీకుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేయడం మంచిదని తెలిపారు. ఆ నిరుపైన వృద్ధ మహిళలు సంతోషంతో ఆ చీరలను అందుకొని మీ కుటుంబం లో అందరూ సుఖశాంతులతో,సంతోషంగా ఉండాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని వారు ఆశీర్వదించారు.



## రైతుల సౌకర్యాలే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం సహకార వ్యవస్థ బలోపేతానికి మరో ముందడుగు.. ఐతవరం సొసైటీలో నూతన క్యాష్ కౌంటర్ ప్రారంభం.

**ఐతవరం సొసైటీ అభివృద్ధితో రైతులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**నీలగిరి వార్త,**



నందిగామ: రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు.నందిగామ మండలం ఐతవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (రాజా) సొసైటీలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాష్ కౌంటర్‌ను ఉమ్మడి కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ శ్రీ నెట్టెం రఘురాం మాజీ మంత్రి శ్రీ వసంత నాగేశ్వరరావు , మైలవరం ఎమ్మెల్యే శ్రీ వసంత కృష్ణ ప్రసాద్ గార్లతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా సొసైటీలో రైతులకు అందుతున్న సేవలు, నగదు లావాదేవీల నిర్వహణ, సహకార బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా రైతులకు కలుగుతున్న ప్రయోజనాలపై నాయకులు చర్చించారు. నూతన క్యాష్ కౌంటర్ అందుబాటులోకి రావడంతో రైతులు, ఖాతాదారులకు లావాదేవీల నిర్వహణ మరింత సులభతరం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాల సేవలను మెరుగుపరచడం ద్వారా రైతులకు స్థానికంగానే అవసరమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుంది. రైతు సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేయడం, రైతులకు అవసరమైన సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వ్యవసాయ రంగానికి మరింత అండగా నిలవవచ్చని తెలిపారు.ప్రజలకు, రైతులకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఐతవరం సొసైటీలో నూతన క్యాష్ కౌంటర్ ప్రారంభించడం సంతోషకరమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత బ్యాంకు అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సహకార బ్యాంకింగ్ సేవల మెరుగుదలకు, రైతులకు మరింత సౌకర్యవంతమైన సేవల అందుబాటుకు ప్రాధాన్యత లభించింది.కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ మద్దుకూరి రామారావు, సొసైటీ చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, సహకార సంఘం ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# తాళ్లపూడిలో రైతు బజారు భవనం కూల్చివేత.. కూటమి ప్రభుత్వంపై వైకాపా నేత తోట రామకృష్ణ ఆరోపణలు!

**కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి**

మండల కేంద్రమైన తాళ్లపూడిలో ప్రభుత్వ నిధులతో లక్షల రూపాయలతో నిర్మించిన రైతు బజారు భవనాన్ని కూటమి ప్రభుత్వం కూల్చివేయడం పట్ల వైకాపా రాష్ట్ర కార్యదర్శి తోట రామకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఏదో మేలు చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వానికి ఈ కూల్చివేతలు ఎందుకు కనిపించడం లేదని ఆయన నిలదీశారు. రైతు బజారు వద్దకు వచ్చి స్థానిక రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయించుకుంటున్నారని, ప్రస్తుతం భవనాన్ని కూల్చివేయడం ద్వారా వారికి కనీసం దారి లేకుండా చేశారని ఆరోపించారు.గతంలో , వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్ దీనిని ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు రైతులు ఇక్కడే తమ కూరగాయలు, పంటలను విక్రయించుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ రైతు బజారు భవనాన్ని హటాత్తుగా పడగొట్టడానికి అసలు కారణం ఏమిటనే విషయంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ విషయమై స్థానిక అధికారులు అందుబాటులో లేకపోవడంతో పూర్తి వివరాలు తెలియరాలేదు. ఈ కూల్చివేతలపై ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు స్పందించి రైతులకు తగిన ప్రత్యామ్నాయం చూపాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు.





# ఎంపీడీఓను కలిసిన తాడిపూడి సొసైటీ అధ్యక్షులు నామా కొండబాబు

**కొవ్వూరు నీలగిరి వార్తప్రతినిధి**

తాళ్లపూడి మండలంలోని తాడిపూడి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా స్థానిక నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే తాడిపూడి సొసైటీ అధ్యక్షులు నామా సుబ్బారావు (కొండబాబు) ఇటీవల నూతనంగా జాయిన్ అయినా తాళ్లపూడి మండల ఎంపీడీఓ బి. అమ్మిరాజును మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలియజేశారు గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.ఈ భేటీలో భాగంగా గ్రామంలో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారులు, పారిశుద్ధ్య నిర్వహణ మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎంపీడీఓతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా చూడటంలో అధికారుల పాత్ర కీలకమని, గ్రామస్తుల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని నామా కొండబాబు కోరారు. గ్రామంలో ఇంకా పూర్తి కావాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తాడిపూడికి చెందిన టీడీపీ నాయకులు రాధాకృష్ణ తదితరులు కూడా పాల్గొన్నారు.



# జ్ఞానేశ్ కుమార్ తొలగింపు డిమాండ్.. సీజేపీ నాయకుల అక్రమ అరెస్టులపై శ్యామ్ రవి ప్రకాష్ ఖండన

**కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి**



కొవ్వూరు భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసనలు తెలుపుతున్న సీజేపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ ఖండించారు. ఒక వ్యక్తి కోసం రాజ్యం ఇంత తీవ్రమైన హింసకు పాల్పడటం అత్యంత దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో సర్ నేమ్ ఆధారంగా అక్రమంగా ఓట్లను తొలగించడం పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమని ఆయన ఆక్షేపించారు. ఎన్నికల అధికారి అధికారంలో ఉన్నప్పుడు కానీ, లేనప్పుడు కానీ ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోకూడదనే నిబంధనలతో జ్ఞానేశ్ కుమార్‌కు పదవిని కట్టబెట్టారని విమర్శించారు. దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్లను తొలగించినప్పటికీ, ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు.స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారిని తరిమికొట్టేందుకు 1942 ఆగస్టు 8న ప్రారంభించిన 'క్విట్ ఇండియా' ఉద్యమం లాగే, అవినీతి, అక్రమాలు మరియు ప్రైవేటీకరణ నుండి దేశాన్ని కాపాడుకునేందుకు 'విముక్తి భారత్' ఉద్యమాన్ని నిర్మిస్తామని బొంతా శ్యామ్ రవిప్రకాష్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# కొవ్వూరు నియోజకవర్గంలో సమన్వయ కర్తలుగా గంటా, ఉప్పులూరి, కొప్పాక నియామకం

**కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి**

స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి జనసేన పార్టీ అధిష్టానం సమాయత్తమవుతున్న తరుణంలో కొవ్వూరు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కొవ్వూరు నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్తలుగా తాళ్లపూడి మండలం నుండి గంటా శివరామకృష్ణ, చాగల్లు మండలం నుండి ఉప్పులూరి చిరంజీవి, కొవ్వూరు మండలం నుండి కొప్పాక విజయ్ కుమార్ లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలోని మూడు మండలాల జనసైనికులు, క్రియాశీలక నాయకుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలు చేపట్టడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.
స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జనసేన అధిష్టానం, క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌ను సమాయత్తం చేయడానికి పకడ్బందీ



వ్యూహంతో ముందుకు వెళ్తోంది. ఇందులో భాగంగానే మండలాలవారీగా సమన్వయ కర్తలతో పాటు 32 మందితో కూడిన నిర్వాహక దళ్ సభ్యులను, మరో ఐదుగురు సపోర్టర్లను కూడా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ పటిష్టమైన కమిటీల ఏర్పాటు ద్వారా గ్రామస్థాయిలో పార్టీ సిద్ధాంతాలను, ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి మార్గం సుగమమైంది. పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం



పెంచడంలోనూ, రాబోయే ఎన్నికల్లో జనసేన విజయావకాశాలను మెరుగుపరచడంలోనూ ఈ క్రియాశీలక బృందాల నియామకం ఎంతో కీలకపాత్ర పోషించనుంది.
నూతనంగా ఎన్నికైన సమన్వయ కర్తలు గంటా శివరామకృష్ణ, ఉప్పులూరి చిరంజీవి, కొప్పాక విజయ్ కుమార్ లకు జనసేన పార్టీ రాష్ట్ర, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు



మరియు జనసైనికులు ఘనంగా అభినందనలు తెలిపారు. .

# కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో 18 కిలోల ఎండు గంజాయి పట్టివేత





## రూ.9 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలుకామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 18 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని, అక్రమంగా గంజాయి తరలిస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.దసరా పండుగ నేపథ్యంలో అక్రమ మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా, తనిఖీలు చేపట్టారు. నాగవల్లి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో కానిస్టేబుళ్లు అమృత్ రెడ్డి, శిరీష, రాజు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) సిబ్బంది సహకరించారు.తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా కనిపించి అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అధికారులు తనిఖీ చేయగా, అతని వద్ద 18 కిలోల ఎండు గంజాయి లభించింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.నిందితుడిని అశోక్ (26)గా గుర్తించామని, అతను మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినికి చెందిన వ్యక్తి అని అధికారులు వెల్లడించారు. ఒడిశాలోని టిట్లాగఢ్ ప్రాంతం నుంచి నాగవల్లి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయిని తీసుకొని సోలాపూర్‌కు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని తెలిపారు.అక్రమ మాదకద్రవ్యాలపై సమాచారం అందించండిదసరా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు, గంజాయి రవాణా, ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిస్తే వెంటనే ఎక్సైజ్ శాఖ అధికారి ముకుంద రెడ్డి, కోరారు.సమాచారం అందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2523 కు కాల్ చేయవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అక్రమ కార్యకలాపాలపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పండుగ సమయంలో అక్రమ మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

# ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్స్ చోరీ ముఠాలో పరారీలో ఉన్న మరో నిందితుడి అరెస్ట్





## కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో వరుస ట్రాన్స్‌ఫార్మర్ చోరీలకు పాల్పడిన ముఠాలో కీలక నిందితుడి పట్టివేత

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

కామారెడ్డి జిల్లాతో పాటు మెదక్ జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ కాయిల్స్ చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా ముఠాలో పరారీలో ఉన్న మరో నిందితుడిని భిక్నూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు తక్ షంషేర్ సింగ్‌ను తేదీ.10.10.2026 న భిక్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో నేరానికి పాల్పడేందుకు రెక్కీ నిర్వహిస్తున్న సమయంలో పట్టుకున్నట్లు కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్ తెలిపారు. గతంలో భిక్నూర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 340/2026 కేసులో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్స్ చోరీలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బల్జీత్ సింగ్ చతుర్ సింగ్ తక్, రూప్ సింగ్ చతుర్ సింగ్ తక్, లఖన్ చతుర్ సింగ్ తక్‌లను పోలీసులు అరెస్ట్ చేసి, 11.09.2026న కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడైన తక్ షంషేర్ సింగ్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. అతని కోసం గాలింపు చేపట్టిన పోలీసులు తాజాగా పట్టుకున్నారు.విచారణలో నిందితుడు తక్ షంషేర్ సింగ్, సత్నామ్ సింగ్‌తో కలిసి పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ చోరీలకు పాల్పడినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని భిక్నూర్, రాజంపేట, జుక్కల్, పెద్దకొడపగల్, బిచ్కుంద, మద్నూర్, పిట్లం పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులతో పాటు మెదక్ జిల్లాలోని చేగుంట, నర్సింగి, నిజాంపేట, శంకరంపేట, శివంపేట, తూప్రాన్, వెల్దుర్తి, రామాయంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులపై విచారణ కొనసాగుతోంది.నిందితుడు మొత్తం 54 ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కేసుల్లో తన ప్రమేయం ఉన్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో మొత్తం 73 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ కేసులకు సంబంధించి సంబంధిత పోలీస్ స్టేషన్లతో సమన్వయం చేసుకుంటూ తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుడి వద్ద నుంచి రెండు ఆక్సర్ బ్లేడ్లు, రెండు కటింగ్ ప్లయర్లు, రెండు పానలు, ఒక కట్టర్, ఒక సైకిల్ ట్యూబుతో పాటు నంబర్ ప్లేట్ లేని ప్యాషన్ ప్రో ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్ పర్యవేక్షణలో భిక్నూర్ సీఐ జె. నరేష్, భిక్నూర్ ఎస్‌హెచ్‌ఓ ఎస్. అనిల్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ క్రైమ్ పార్టీ సిబ్బంది ఏఎస్ఐ వెంకట్రావు, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, శ్రీకాంత్, కిషన్ గౌడ్, శేఖర్ ఈ ఆపరేషన్‌లో పాల్గొని నిందితుడిని పట్టుకున్నారు.ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు, విద్యుత్ పరికరాల చోరీలు లేదా ఇతర అనుమానాస్పద కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

## ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో తెలియని ఆడపడుచుల సంబరాలు

భీమదేవరపల్లి నీలగిరి వార్త న్యూస్ అక్టోబర్ 10)

హనుమకొండ జిల్లా ఈమదేవరపల్లి మండలంలో అన్ని గ్రామాలలో శనివారం అమావాస్య రోజున గౌరమ్మకు భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించి తొమ్మిది రోజులు జరిగే బతుకమ్మ వేడుకలను కోలాటాలతో నృత్యం చేస్తూ సంబరాలను జరుపుకున్నారు ఈ బతుకమ్మ సంబరాలకు ఆడబిడ్డలకు సంతోషాలకు సహకరించిన ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డికి గ్రామ కార్యదర్శి మరియు వార్డు సభ్యులకు హాలో పంచాయితీ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు





## రాగం సుజాత యాదవ్ జయంతి సందర్భంగా మెగా బతుకమ్మ సంబరాలు..

### విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్ల ప్రధానం.





.శేరిలింగంపల్లి నీలగిరి వార్త

శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పి జె ఆర్ స్టేడియంలో రాగం సుజాత నాగేందర్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ రాగం సుజాత యాదవ్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన మెగా బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా, పండుగ వాతావరణాన్ని తలపించేలా ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ, రాష్ట్ర యాదవ కురుమ కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం రఘునాథ్ యాదవ్ , ఉమెన్ కమిషన్ మాజీ చైర్పర్సన్ త్రిపురాన వెంకటరత్నం , టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ , హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ , చందానగర్ సీఐ శ్రీధర్, పురప్రముఖులు, సీనియర్ నాయకులు ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ముందుగా స్వర్గీయ రాగం సుజాత యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించిన అనంతరం, దుర్గాదేవి మాతకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి.. రంగురంగుల పూలతో అలంకరించిన భారీ బతుకమ్మ వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సుమారుగా 5000 మందికి పైగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో, కోలాటాలతో స్టేడియం మొత్తం పండుగ శోభను నింపుతూ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సంబరాల్లో రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ , వారి సతీమణి రాగం జాగృతి సాయి యాదవ్ మరియు రాగం అభిషేక్ యాదవ్ పాల్గొని బతుకమ్మ ఆడి విద్యార్థుల్లో జోష్ నింపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తన సతీమణి గురించి మాట్లాడుతూ.. మే 9, 1996 నుండి దాదాపు 30 ఏళ్ల పాటు నా జీవితంలో తోడుగా, ప్రజా సేవలో అండగా నిలిచిన రాగం సుజాత యాదవ్ ఇక లేరనే బాధ మాటల్లో చెప్పలేనిది. వారికి అత్యంత ఇష్టమైన బతుకమ్మ పండుగను జయంతి రోజున ఇంత ఘనంగా నిర్వహించడం వారి ఆత్మకు శాంతిని చేకూరుస్తుందని తన కోరిక మేరకు నా మిగిలిన జీవితం ప్రజా సేవకే అంకితం చేస్తానని భావోద్వేగం తో ఆయనఅన్నారు. అనంతరం బతుకమ్మ సంబరాల్లో చురుకుగా పాల్గొన్న పాఠశాల విద్యార్థినులకు రాగం సుజాత యాదవ్ జయంతి సందర్భంగా మెమెంటోలు మరియు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను విచ్చేసిన ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రధానం చేశారు. మాజీ పార్లమెంట్ సభ్యులు, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు విద్యార్థులతో కలిసి బతుకమ్మ డీజే స్టెప్పులు వేసి సందడి చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సుమారు 5000 మందికి పైగా భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి, కనీ వినీ ఎరుగని రీతిలో కార్యక్రమాన్ని నిర్వహించిన రాగం నాగేందర్ యాదవ్ ని కొనియాడుతూ ఈ మెగా బతుకమ్మ సంబరాలు గిన్నిస్ బుక్ రికార్డుల్లో నమోదైనా ఆశ్చర్యం లేదని పేర్కొన్నారు. కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. వేలాదిగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసి పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ముందుగా బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. కృతజ్ఞతలు తెలిపారు. అలాగే శేరిలింగంపల్లి మండల రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లయన్ ఏ.ఆర్. పవన్ కుమార్ మరియు వారి బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా అసోసియేషన్ అభివృద్ధి కోసం కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ రూ. 1,00,000/– (లక్ష రూపాయలు) చెక్కును అసోసియేషన్ వారికి అందజేశారు. ఈ కార్యక్రమాన్ని యువ నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ స్పాన్సర్ చేయగా లయన్ ఏ.ఆర్. పవన్ కుమార్ ఆధ్వర్యంలోని శేరిలింగంపల్లి మండల రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ వారు నిర్వహించారు

## హెచ్ సి యు బస్ డిపో, మియాపూర్ వన్(1) డిపో లలో ఏఐటీయూసీ కూటమికి ఘన విజయం..

అధిక మెజారిటీతో గెలుపు కార్మిక ఐక్యతకు నిదర్శనం..

టి రామకృష్ణ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే చందు యాదవ్ శేర్లింగంపల్లి నియోజకవర్గం కార్యదర్శి ..

శేరిలింగంపల్లి నీలగిరి వార్త..

హైదరాబాద్ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ సి యు బస్ డిపోలో అధిక మెజారిటీతో విజయం సాధించిన అధ్యక్షులుగా లక్ష్మణ్ జనరల్ సెక్రెటరీ లార్య నాయక్ మరియు మియాపూర్ 1 డిపోలో అధ్యక్షులుగా రాఘవేందర్ సెక్రెటరీగా భాషా గౌడ్ లకు ఏఐటీయూసీ కూటమి అభ్యర్థులకు సిపిఐ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం ఆర్టీసీ కార్మికుల ఐక్యతకు, కార్మిక హక్కుల కోసం ఏఐటీయూసీ కూటమి సాగిస్తున్న పోరాటాలకు నిదర్శనమని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే సంఘాలకే కార్మికులు పట్టం కడతారని ఈ ఫలితం స్పష్టం చేస్తోందన్నారు. ఆర్టీసీ కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని, ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి నాయకులు కృషి చేయాలని కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికులకు మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత, మెరుగైన వైద్య సదుపాయాలు, కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడం వంటి ప్రధాన డిమాండ్ల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో ఏఐటీయూసీ ముందుండి పోరాడుతుందని, కార్మికుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిపిఐ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కె వెంకటస్వామి జిల్లా కౌన్సిల్ సభ్యులు జె శ్రీనివాస్ శేర్లింగంపల్లి నియోజకవర్గం సహాయ కార్యదర్శి బి నారాయణ ఏఐటీయూసీ అధ్యక్షులు పాల్గొన్నారు.






## ఉత్తమ సామాజిక సేవలకు గుర్తింపుగా ముండ్లమూరి నాగూర్ రావుకి డాక్టరేట్ ప్రదానం.

శేరిలింగంపల్లి నీలగిరి వార్త..






సామాజిక సేవా రంగంలో విశేషమైన సేవలు అందిస్తూ నిరుపేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మదీనాగూడ మై హోమ్ జువెల్ నివాసి ముండ్లమూరి నాగూర్ రావుకి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సమాజ అభివృద్ధికి, మానవతా విలువల పరిరక్షణకు ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ డాక్టరేటును శనివారం చెన్నైలోని కృష్ణ గాన సభా వేదికగా యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ వారు ప్రధానం చేసినారు నాగూర్ రావు సామాజిక సేవల్లో భాగంగా ఆకలితో ఉన్న పేదలకు అన్నదానం, ఉచిత ఆరోగ్య పరీక్షల నిర్వహణ, పేదలకు150 పైగా ఉచిత కంటి శుక్లాల శస్త్రచికిత్సలకు సహకారం, పేద అనాథ విద్యార్థులకు విద్యా సహాయం, వృద్ధాశ్రమాలకు తోడ్పాటు వంటి సేవలు ప్రధానంగా ఉన్నాయి. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ, అవసరమైన వారికి సహాయం అందించడమే తన సేవా లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగూర్ రావు మాట్లాడుతూ నా సామాజిక సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను అందుకోవడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఈ గౌరవాన్ని సమాజానికి, మానవాళికి అంకితం చేస్తున్నాను. పేదలకు ఆకలి నుంచి ఉపశమనం కల్పించడం, ఆరోగ్య సేవలు అందించడం, విద్యార్థులకు విద్యా అవకాశాల్లో సహకరించడం, వృద్ధులకు అండగా నిలవడం వంటి సేవలను మరింత నిబద్ధతతో కొనసాగిస్తాను. సమాజానికి సేవ చేయడమే నా జీవిత ధ్యేయం" అని తెలిపారు. మానవ సేవే మాధవ సేవ సమాజ సేవే నా జీవిత ధ్యేయం అనే ఆశయంతో భవిష్యత్తులోనూ పేదలు, నిరుపేదలు మరియు అవసరంలో ఉన్నవారికి తన వంతు సహకారం అందిస్తానని నాగూర్ రావు తెలిపారు ఈ గౌరవం తన సామాజిక సేవా ప్రయాణంలో మరింత బాధ్యతతో ముందుకు సాగేందుకు ప్రేరణనిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ రైతులకు 24 గంటలు విద్యుత్తు ఇవ్వాలి

రైతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం:

బీజేపీ రాష్ట్ర నాయకులు మేకల ప్రభాకర్ యాదవ్:

నీలగిరి వార్త

రామడుగు మండలం లో రైతులు పడుతున్న కరెంట్ కోతలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో వెదిర జాతీయ రహదారిపై రైతులతో కలిసి బారి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు మేకల ప్రభాకర్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ధగకోరు పాలన నడుస్తుందని రైతులను కరెంట్ కోతలతో అరిగోస పెడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని విరుచుకుపడ్డారు. ఎద్దు ఎడిసిన ఎవుసం రైతు పెట్టిన కన్నీరు ప్రభుత్వ లకు తగులుతుందని రైతు ల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వం నికి తగిలి మరోసారి అధికారంలోకి రాకుండా చేస్తుందని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన విధంగా రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. బారి నిరసన సంధర్భంగా పోలీసులకు బీజేపీ నాయకులకు తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. బారి ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ఆందోళనకారులను విరమించే ప్రయత్నంలో కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించే ప్రయత్నం లేదని బీజేపీ నాయకులు బిష్మించుకొని కూర్చున్నారు. రైతులకు 24 గంటల కరెంట్ అందించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలసి కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పు శ్రీనివాస్ పటేల్ బండ తిరుపతి రెడ్డి దళిత మోర్చా మండల ఉపాధ్యక్షుడు కొలపురి రమేష్ మహిళ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు



మామిడిపెల్లి చైతన్య మండల ప్రధాన కార్యదర్శిలు పోచంపెల్లి నరేష్ గుంట అశోక్ మండల ఉపాధ్యక్షులు కాడే నర్సింగమ్ దుర్శేటి రమేష్ సర్పంచ్ దయ్యాల వీరమల్లు ఉప సర్పంచ్ లు వేముండ్ల కుమార్ కుమ్మరి అనిల్ బీర్ల వినోద్ సందపలుకల మహేందర్ యువ మోర్చా మండల అధ్యక్షులు దయ్యాల రాజు (ఓబీసీ)మోర్చా మండల అధ్యక్షులు జంగిలి కరుణాకర్ యువ మోర్చా నాయకులు ఎడవెల్లి రాం ఎడవెల్లి లక్ష్మణ్ బండారి శ్రీనివాస్ మాడిశెట్టి అనిల్ ఐటీ సెల్ మండల కన్వీనర్ మాడిశెట్టి జయంత్ నాయకులు సూదగోని మహేష్ రాళ్లబండి సత్యనారాయణ రెడ్డి వేముల రమేష్ షేవెళ్ల అక్షయ్ పురేళ్ల రాజశేఖర్ కడారి శ్రీనివాస్ మంద రాజేశేఖర్ కారుపాకల నరేష్ బుర్ర శ్రీధర్ మహేష్ ఉత్తేమ్ సాయి జాడి వంశీ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి పట్టణ 9వ వార్డు కల్కి నగర్ ఐదవ వీధిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 9 వ వార్డు కల్కినగర్ 5వ వీధిలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించుకోవడం. బతుకమ్మ పాట పాడుతూ బతుకమ్మ ఆడుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ ఎంగిలిపూల బతుకమ్మతో ఘనంగా బతకమ్మ మొదటిరోజు సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవడం జరిగిందని బతుకమ్మ అంటే బతుకు నిచ్చే అమ్మ బతుకమ్మ పండుగ అంటారని తెలిపారు. ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగ కల్కి నగర్ ఐదోవ వీధిలో బతుకమ్మ సంబరాలు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఉత్సాహంగా సంతోషాలతో పాల్గొన్నారు.





## పట్టణ 46వ వార్డులో రూ.10 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

కామారెడ్డి పట్టణ అభివృద్ధిలో భాగంగా 46వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం ప్రారంభించారు. స్థానిక కౌన్సిలర్ గేరిగంటి లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ కన్నయ్యతో కలిసి ఆయన పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వార్డుల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతన సీసీ రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకల్లో సౌకర్యం కలుగుతుందని, రహదారుల అభివృద్ధి ద్వారా పట్టణంలో మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, కౌన్సిలర్లు అన్వార్, షేరు, సత్యం, సిద్దిక్, అంజాద్, యూనుస్, చిట్టిబాబు, గంగాధర్, లోలం శ్రీనివాస్, లక్ష్మణ్, మన్సూర్, గేరిగంటి స్వప్న, పిట్ల వేణు, ఏజాజ్, గూడెం శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, రాజగౌడ్, భూమని బాలరాజు, అనుమాల రాము కుమార్, ఇంద్రకరణ్ రెడ్డి, అశోక్ రెడ్డి, పండ్ల రాజు, కన్నయ్య, నరేందర్ రెడ్డి, గొనె శ్రీనివాస్, ముబషీర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఇందిరాగాంధీ స్టేడియంలో మళ్లీ ఘనంగా దసరా ఉత్సవాలు నిర్వహణ






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ ఏడాది దసరా ఉత్సవాలను షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. శనివారం ఇందిరాగాంధీ స్టేడియంలో కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఫ్లడ్‌లైట్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో దసరా ఉత్సవాల పునఃప్రారంభంపై వివరాలు వెల్లడించారు. షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతంలో ఏటా దసరా ఉత్సవాలు, రావణ దహనం, లేజర్ షో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేవారమని షబ్బీర్ అలీ గుర్తుచేశారు. కరోనా మహమ్మారి కారణంగా ఈ కార్యక్రమాలకు విరామం ఏర్పడిందని తెలిపారు. ఈ ఏడాది నుంచి తిరిగి దసరా ఉత్సవాలను ప్రారంభించి, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 1990లో తొలిసారిగా మల్లన్నగుట్ట వద్ద రావణ దహనం, లేజర్ షోతో దసరా ఉత్సవాలను ప్రారంభించినట్లు షబ్బీర్ అలీ తెలిపారు. అనంతరం నాలుగు సంవత్సరాల పాటు సీఎస్సీ గ్రౌండ్‌లో ఉత్సవాలు నిర్వహించామని, ఇందిరాగాంధీ స్టేడియం అందుబాటులోకి వచ్చిన తర్వాత సుమారు 20 సంవత్సరాల పాటు అక్కడే దసరా వేడుకలను ఘనంగా నిర్వహించామని వివరించారు. అయితే కొన్ని రాజకీయ పార్టీల ఒత్తిళ్లు, ఇతర అనివార్య కారణాల వల్ల గతంలో నాలుగు సంవత్సరాల పాటు ఉత్సవాలను నిర్వహించలేకపోయామని పేర్కొన్నారు. ప్రస్తుతం తిరిగి ఉత్సవాలను పునఃప్రారంభించి ఈ ఏడాది ఆకర్షణీయమైన లేజర్ షోతో పాటు రావణ దహనం, దసరా వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దసరా ఉత్సవాల నిర్వహణ కోసం త్వరలో ప్రత్యేక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తామని షబ్బీర్ అలీ తెలిపారు. కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించి, కామారెడ్డి పట్టణ ప్రజలకు పండుగ వాతావరణాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందిరాగాంధీ స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు పూర్తయితే క్రీడాకారులకు, క్రీడా కార్యక్రమాలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. స్టేడియం అభివృద్ధితో పాటు దసరా ఉత్సవాల పునఃప్రారంభం ద్వారా పట్టణ ప్రజలకు మరింత ఉత్సాహభరితమైన వేడుకలను అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ కౌన్సిలర్లు అన్వార్, షేరు, సత్యం, సిద్దిక్, అంజాద్, యూనుస్, చిట్టిబాబు, గంగాధర్, లోలం శ్రీనివాస్, లక్ష్మణ్, మన్సూర్, గేరిగంటి స్వప్న, పిట్ల వేణు, ఏజాజ్, గూడెం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సందీప్, రాజగౌడ్, భూమని బాలరాజు, అనుమాల రాము కుమార్, ఇంద్రకరణ్ రెడ్డి, అశోక్ రెడ్డి, పండ్ల రాజు, కన్నయ్య, నరేందర్ రెడ్డి, గొనె శ్రీనివాస్, ముబషీర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో నూతనంగా మీనాక్షి హాస్పిటల్ ప్రారంభం

### ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయం: మహమ్మద్ అలీ షబ్బీర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

కామారెడ్డి పట్టణంలోని రామారెడ్డి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మీనాక్షి హాస్పిటల్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యమని, పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నూతన ఆసుపత్రులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. వైద్య రంగంలో సేవాభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన చికిత్స అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, పండ్ల రాజు, అశోక్ రెడ్డి, చాట్ల రాజేశ్వర్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కౌన్సిలర్లు లడ్డు, సత్యం, సిద్దిక్, అంజాద్, చిట్టిబాబు, గంగాధర్, ముబషీర్, గొనె శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్ రెడ్డి, రాజగౌడ్, మోహన్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు భూమని బాలరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి నాయక్, నౌసిలాల్, గణేష్ నాయక్, రాము కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.





## హామ్‌స్టెక్ కళాశాలలో నేడు ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ--2026..

**హైదరాబాద్ నీలగిరి వార్త:**

హామ్‌స్టెక్ కాలేజ్ ఆఫ్ క్రియేటివ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నూతన విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ఫ్రెషర్స్ పార్టీ--2026ను శనివారం నిర్వహించనున్నారు. నార్సింగిలోని ది అడ్రస్ కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటల నుంచి వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో సంగీతం, వినోద కార్యక్రమాలతో పాటు విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విభిన్న సృజనాత్మక విద్యా విభాగాలకు చెందిన విద్యార్థులు పరస్పరం పరిచయాలు పెంచుకొని, కళాశాల జీవితాన్ని ఉత్సాహంగా ప్రారంభించేందుకు ఈ వేడుక వేదిక కానుంది. విద్యార్థుల్లో సృజనాత్మకత, సహకారం, సమిష్టి భావనను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల వర్గాలు తెలిపాయి.




## కాంగ్రెస్ అంటేనే కరెంటు కష్టాలు రైతుల ఆందోళన

**విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ఎండుతున్న పంటలు రోడ్లు ఎక్కుతున్న రైతులు**

**నవాబుపేట్ మండల టిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి కుమార్**

**నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట్ మండలం**

నవాబు పెట్ :- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు కరెంటు కష్టాలను ఎదుర్కొంటున్నారు నవాబుపేట మండల బి.ఆర్.ఎస్ పార్టీ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి కుమార్ విమర్శించారు వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సక్రమంగా లేక సకాలంలో నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆయన తెలిపారు. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో కరెంటు కష్టాలు లేకుండా ప్రజలు ఎంతో ఆనందంగా ఉండేవారని పంటలు సక్రమంగా పండించుకునే వారని తెలిపారు గ్రామంలో కనీసం 6:00 కూడా త్రీఫేస్ కరెంటు లేక ప్రజలు పంటలు పండించలేక పంట పొలాలకు సాగునీరు అందడం లేదని తెలిపారు అదేవిధంగా గ్రామాలలో ఇప్పటికే కరెంటు కష్టాలతో రైతులు ఆందోళన చెందుతుంటే దొంగలు భయం కూడా ఎక్కువ అయిపోయిందని తెలిపారు గ్రామాలలో భారీ మోటర్ల దగ్గరికి వెళ్లి మోటార్ల దగ్గర నుండి వైర్లు దొంగలించడంతో రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు నవాబుపేట మండలం కేశవ్ పల్లి గ్రామంలో నిత్యం పంటలపై ఆధారపడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన పేర్కొన్నారు. కేశవ పల్లి గ్రామంలో ప్రతి రైతు కుటుంబమేనని ఎక్కువగా మండలంలో కేశేపల్లి గ్రామం నుండి క్యారెట్ కూరగాయలు తదితర పంటలు సాగునీటితో పండించేవారు ఉన్నారని వాటికి సరైన నీరు అందలేక పంటలు ఎండిపోతున్నాయని దీనికి అంతటి కారణం కరెంటేనని తెలిపారు వెంటనే ప్రభుత్వం కరెంటు పై చర్యలు తీసుకొని రైతులకు అన్ని విధాలుగా కరెంటు అందేటట్లు చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు.



## రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు రైజింగ్ సన్ విద్యార్థిని సహస్ర

**నీలగిరి వార్త:**

జిల్లా కేంద్రంలోని రైజింగ్ సన్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సహస్ర రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. గత నెల 30న స్థానిక రైజింగ్ సన్ పాఠశాలలో జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలలో సహస్ర అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తగురం తిరుపతి తెలిపారు. కాగా ఈ నెల 10వ తేదీ నుం చి12వ తేదీ వరకు ఆసి ఫాబాద్‌లోని మోడల్ స్కూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలలో సహస్ర పాల్గొన నున్నదని పాఠశాల కరస్పాండెంట్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్, ప్రధానోపాధ్యాయు లు హకీమ్ ఖాన్ విద్యార్థిని సహస్రను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీలలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, పెద్దపల్లి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రంగురంగుల పూల సంబరమాయే..

## .సాయి మెరిట్ ఆవరణలో పూల జాతరాయే.

## సాయి మెరిట్ హైస్కూల్లో అంబరాననంటిన బతుకమ్మ సంబరాలు






**ముదిగొండ, నీలగిరి వార్త, అక్టోబర్ 10.**

ముదిగొండ మండల పరిధిలోని కమలాపురం సాయి మెరిట్ హైస్కూల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు అత్యంత ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడ్డాయి. తెలంగాణ సంస్కృతిని భావితరాలకు చాటిచెప్పేలా పాఠశాల ఆవరణలో ఈ వేడుకలను కనులపండువగా ఏర్పాటు చేశారు. పాఠశాల అధినేత కందుల శంకరయ్య, ప్రధానోపాధ్యాయులు సూరంపల్లి వెంకటేశ్వర్లు జ్యోతి వెలిగించి బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా ప్రారంభించారు.?ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినులు ఎంతో సృజనాత్మకతను ప్రదర్శిస్తూ వివిధ రకాల రంగురంగుల, సువాసన వెదజల్లే పూలతో అందంగా బతుకమ్మలను తీర్చిదిద్దారు. విద్యార్థులు స్వయంగా అమర్చిన ఈ పూల బతుకమ్మలు పాఠశాల ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకునేలా చేశాయి. చిన్నారులందరూ సంప్రదాయ వస్త్రధారణతో హాజరై, బతుకమ్మ చుట్టూ తిరుగుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉపాధ్యాయులను, తోటి విద్యార్థులను ఎంతగానో అలరించాయి. విద్యార్థుల ఉత్సాహం, కేరింతలతో పాఠశాల ప్రాంగణమంతా మార్మోగింది. ?ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ కేవలం పూల వేడుక మాత్రమే కాదని, అది తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మనిషికి ఉన్న విడదీయరాని అనుబంధానికి ప్రతీక అని వివరించారు. నేటి ఆధునిక కాలంలో విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాధాన్యతను తెలియజేయడం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులను క్రియాశీలకంగా భాగస్వామ్యం చేయడం వల్ల వారిలో సృజనాత్మక శక్తి, తోటివారితో ఐకమత్యం, మన సంప్రదాయాల పట్ల సముచిత గౌరవం మరింత పెరుగుతాయని తెలిపారు.?పాఠశాల ఆవరణలో పూల బతుకమ్మలతో నెలకొన్న పండుగ వాతావరణం, విద్యార్థుల కోలాహలం చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. చివరకు అందరూ కలిసి బతుకమ్మలను సమీపంలోని జలవనరులలో నిమజ్జనం చేయడంతో ఈ బతుకమ్మ సంబరాలు మధుర జ్ఞాపకాల మధ్య ముగిశాయి.

## దుర్గామాత గ్రాండ్ ఆగమనం ఉత్సవంలో పాల్గొన్న.

### పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**

ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల వద్ద నిర్వహించిన దుర్గామాత గ్రాండ్ ఆగమనం ఉత్సవంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు



## వరంగల్ టికెట్ చెకింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారం కొరకు .

### మజ్దూర్ యూనియన్ పర్యటన.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**

వరంగల్ కేంద్రంగా పని చేస్తున్న టికెట్ చెకింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారం కొరకు మజ్దూర్ యూనియన్ కాజీపేట జనరల్ బ్రాంచ్ చైర్మన్, సిసియాస్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్,జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ యుగంధర్ యాదవ్ ఆధ్వర్యంలో పర్యటన చేశారు.. ఈ సందర్భంగా కార్మికులతో కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు జజుజ ల ప్రమోషన్ పైన జరుగుతున్న జాప్యం మరియు టికెట్ చేకింగ్ స్టాఫ్ రూముకు నార్త్ సైడ్ డోర్ ఏర్పాటు చేయాలనీ కోరారు వెంటనే మజ్దూర్ యూనియన్ నాయకులు వరంగల్ ూరాజు/ఔ/ఔూ అఖిల్ గారితో మాట్లాడి డోర్ ఏర్పాటు పాటు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేణు, హరీష్, పూర్ణ చందర్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



## ఓరుగల్లు శ్రీ భద్రకాళి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఎంపీ రవిచంద్ర కు ఆహ్వానం.




### అమ్మవారి 'పూలంగిసేవ' నిర్వహణ మా అదృష్టం ఎంపీ రవిచంద్ర.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**

ఓరుగల్లు శ్రీ భద్రకాళిదేవి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం నుండి ప్రారంభం కానున్న సందర్భంగా బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర - విజయలక్ష్మి దంపతులను విరి కుమారుడు కోడలు వద్దిరాజు సాయి నిఖిల్ చంద్ర-అనిలా దంపతులను, సోదరులు వద్దిరాజు కిషన్-శశిరేఖ, వద్దిరాజు దేవేందర్-ఇందిరా,వద్దిరాజు వెంకటేశ్వర్లు-ఉమామహేశ్వరి దంపతులను దేవి నవరాత్రి ఉత్సవాలకు కుటుంబ సమేతంగా విచ్చేయవలసిందిగా కోరుతూ శనివారం వారి నివాసంలో శాలువాతో సత్కరించి అమ్మవారి ఆహ్వాన పత్రికతో పాటు తీర్థ ప్రసాదాలను అందించిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత. భద్రకాళి దేవాలయం ప్రధాన అర్చకులు శేషు అయ్యగారు, ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ ఈ నవరాత్రులు అమ్మవారికి అమ్మవారి శేష వాహనములకు ఉదయం సాయంత్రం 'పూలంగిసేవ' చేసుకునే భాగ్యం మా కుటుంబానికి కలగడం అమ్మవారు మాకిచ్చిన అదృష్టంగా భావిస్తున్నాము, ప్రతిరోజు ఉదయం సాయంత్రం వివిధ రూపల్లో కొలువుతిరే అమ్మవారిని,శేష వాహనములను వివిధ రకాల పుష్పములచే గజమాలలతో సర్వాంగ సుందరముగా అలంకరింపచేసి అంగరంగ వైభవంగా నిర్వహిస్తాము కావున భక్తులందరూ ప్రతిరోజు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి కృపకు పాత్రులై తీర్థప్రసాదములు స్వీకరించగలరని కోరినారు.ఈ కార్యక్రమంలో అర్చకులు అరవింద్ శర్మ, భరద్వాజ్ శర్మ, ఆలయ సిబ్బంది సూపరింటెశేడెంట్ కూచన హరినాథ్, నాగులు తదితరులు పాల్గొన్నారు..హనుమద్గిరి పద్మాక్షి దేవి నవరాత్రి ఉత్సవాలకు ఎంపీ రవిచంద్రకు ఆహ్వానంహనుమద్గిరి పద్మాక్షిని ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తున్న బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నివాసానికి విచ్చేసిన ఆలయ అర్చకులు నాగిళ్ల షణ్ముఖ శర్మ అయ్యగ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలకు కుటుంబ సమేతంగా రావాల్సిందిగా కోరుతూ అమ్మవారి ఆహ్వాన పత్రికతో పాటు తీర్థప్రసాదాలు అందించడం జరిగింది.

## వరంగల్ జిల్లాలో వైభవంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**

వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎంగిలిపూల బతుగమ్మ వేడుకలు.కాశివిశ్వేశ్వర ఆలయంతో తోట మైదానం, సీకేఎం కళాశాల మైదానం,కాశీబుగ్గ శివాలయం, శివనగర్ రామాలయం, రంగనాయక మైదానంలో బతుకమ్మ వేడుకల్లో ఆడి పాడిన మహిళలు గునుగు తంగేడు బంతి గుమ్మడిపూలతో అందంగా అలంకరించిన బతుకమ్మ శిఖర భాగంలో గౌరమ్మను కొలువుదీర్చాన మహిళలు.ఒక్కేసి పూవేసి చందమామ పాటలతో మహిళలు ఉత్సహంగా బతుకమ్మను ఆడిన మహిళలు.



## శ్రీ భద్రకాళి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రుల సందర్భంగా.




### మహోత్సవములకు అంకురార్పణ.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**

నేటి నుండి వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా భక్తి ప్రపత్తులతో జరుపబడే శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవములకు ఈ రోజు అనగా దీవి 10-10-2026 శనివారం రోజున అంకురార్పణ జరిగినది. శనివారం ఉదయం అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించిన పిమ్మట జగత్ప్రసూతికా అలంకారం జరిపి భక్తులకు అమ్మవారి హరిద్రా దర్శనాన్ని జరిపారు. భక్తులు సమర్పించిన 27 కిలోల స్వచ్ఛమైన హరిద్రా (పసుపు) చూర్ణంతో అమ్మవారికి హరిద్రాభిషేకం నిర్వహించారు. అతంకుముందు పూజారులు వైదికమైన క్రతువు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేకం జరిపి హరిద్రామయమైన అమ్మవారి దర్శనాన్ని భక్తులకు కల్పించారు. సాయంకాలం వరకు భక్తులందరూ దర్శించుకునే విధంగా అవకాశం కల్పించారు. అనంతరం అంకురార్పణ జరిగినది. పసుపుమయమై ఉన్న అమ్మవారిని దర్శించిన భక్తులు శనివారం తమకు కలిగిన ఆనందానుభూతిని మాటల్లో వర్ణించలేమని తెలిపారు. జగత్ప్రసూతికా అలంకారం హరిద్రా దర్శనం నేపథ్యాన్ని శ్రీ భద్రకాళి శేషు భక్తులకు వివరిస్తూ- సర్వస్యాద్యా మహాలక్ష్మీ స్త్రిగుణా పరమేశ్వరీ।లిలక్ష్మా లక్ష్యాస్వరూపా సా న్యాప్య కృత్స్నం వ్యవస్థితా.కార్యప్రపం చమునకన్నా అవతారములన్నిటికన్ననూ ప్రారంభమున వున్నది మహాలక్ష్మియే. ఆమె నుండియే మహాకాళి, మహాసరస్వతీ, దేవతలు ఆవిర్భవించగా ఈ త్రిశక్తులు మూడు మిధునములను సృష్టించారు. వీళు ్ర బ్రహ్మ, విష్ణు, మహేశ్వర దంపతులు, వీరు సృష్టి, స్థితి, సంహార కారకులు, ఈ జగత్తంతా వీరి నుండి ఉత్పన్నమై పెంచబడి, రక్షింపబడి లయింపబడు చున్నది. క్రమక్రమముగా సమస్త బ్రహ్మాండము వీరి నుండియే ఆవిర్భవించింది. అనగా జగన్మాత మహాలక్ష్మి నుండియే సమస్త బ్రహ్మాండము ఆవిర్భవించినది. కావుననే రేపటి నుండి జరుపబడే దుర్గా శరన్నవరాత్రులకు ముందు రోజయిన అమావాస్యనాడు శృంగేరీ శారదాపీఠంలో అమ్మవారికి జగత్ప్రసూతికా అలంకారమని పసుపుతో జరుపుతారు. అంటే అమ్మవారు ఈ జగత్తును ప్రసవించినది అని అర్థం. ప్రసవానంతరం స్త్రీకి పసుపు ముద్ద లేపనం జరిపి స్నానం జరువుతారు. దానికి ప్రతీకగా అమ్మవారికి హరిద్రా లేపనం చేసి భక్తులు దర్శించిన పిమ్మట అభిషేకం జరుపడం అని శేషు తెలిపారు.అమావాస్య తిథికి అధిదేవతలు పితరులు. ఏ శుభకార్యాన్ని జరుపడానికి ముందుగా నాందీ సమారాధన అని జరుపుతారు. దాన్నే నాంది పలకడం అని అంటారు. దేవయజనానికి ముందుగా సవ్యంగా పితృయజ్ఞాన్ని జరుపడమే నాందీ. దేవతలకిచ్చు హవ్య స్వరూపము పితృదేవతలకిచ్చు కవ్య స్వరూపము ఆ జగన్మాతయే. అనగా పితృదేవతలు అధిదేవతలైన అమావాస్య తిథికి కూడా అధిదేవత స్వధా రూపమైన ఆ జగన్మాతయే. కనుక ఈ రోజును అగన్మాతను ఆరాధించడం వల్ల పితృశాపాలు తొలగిపోయి పితృదేవతల అనుగ్రహం కూడా లభిస్తుంది. కావుననే భాద్రపద బII అమావాస్య రోజున అనేక మంది భక్తులు అమ్మవారిని దర్శిస్తారు. ఈ రోజు పసుపుతో అలంకరింపబడిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఒక అనిర్వచనీయమైన అనందానుభూతిని పొందారు. అనంతరం వాస్తు యాగం, పర్యగ్నికరణం జరుపబడి సాయంకాలం అంకురార్పణ జరుపబడినది. రేపు ఉదయం గంIII 4-00లకు అమ్మవారికి పూర్ణాభిషేకంతో పరాభవ నామ సంవత్సర దేవీశరన్నవరాత్రులు ఆలయంలో ప్రారంభమైతాయి.

## 40 వ డివిజన్లో కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**



పరిపాలన సౌలభ్యం కొరకు తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలను ఏర్పాటు చేసిన నాటి ఉద్యమ నేత నేటి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు యొక్క కృషిని ప్రజలు ఏనాడు మర్చిపోరని 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలను కేసీఆర్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా అక్టోబర్ 10 వ తారీఖున చెట్లోళ్ల గడ్డ వద్ద బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి క్షీరాభిషేకం చేసినారు గతంలో జిల్లాల పరిధి కొన్ని వందల కిలోమీటర్ల దూరం ఉండి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు దృష్టికి తీసుకురావడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యమంత్రి హోదాలో ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు గ్రహించి తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలను ఏర్పాటు చేసి ప్రతి జిల్లాకు కలెక్టర్ భవనం నిర్మింప చేసినారని అందువల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పినాయని అన్నారు నేడు ప్రజలందరూ రేవంత్ రెడ్డి సర్కార్ పీడ ఎప్పుడు వదిలి పోతుందోనని ఎదురుచూస్తున్నారని మళ్లీ కెసిఆర్ గారు ముఖ్యమంత్రిగా రాణించాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు నేటి యువత కేటీఆర్ గారి నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీలో పనిచేయడానికి ఉత్సవం చూపుతున్నారన్నారు ఆర్టీసీ యూనియన్ ఎన్నికలలో అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు ఘోరంగా ఓటమి పాలైనారని బి ఆర్ఎస్ పార్టీ బలపరిచిన యూనియన్లు గెలుపొందినయని కాంగ్రెస్ పార్టీకి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు ఇట్టి కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు వనం కుమార్, మరుపల్ల గౌతం పోలెపాక రాజన్ బాబు శెట్టి మోహన్ అంకం దేవానంద్ కళ్యాణపు వెంకటేశ్వర్లు భౌరిశెట్టి సదానందం కెంచ ఆనంద్ మాటేటి శ్యామ్ టమ్ టమ్ నరసింహ కుండె సదానందం చింతపట్ల ప్రశాంత్ నామాల రాజు అన్న శ్రీనివాస్ యాకూబ్ పాషా పోలేపాక మల్లేశం దాసరి నాగరాజు నరిగె సదానందం కొలుపుల కోటేశ్వర్లు ఉన్నారు.

## పాల్తేరులో 50 లక్షల నిధులతో నిర్మిస్తోన్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన కూటమి పార్టీల నాయకులు

**నీలగిరి వార్త. :**

మండలంలోని పాల్తేరు పంచాయతీ, అంకంపేటలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మంజూరు చేసిన 50 లక్షల రూపాయల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తోన్న సిసి రోడ్లు నిర్మాణానికి శుక్రవారం కూటమి పార్టీల నాయకులు శంకుస్థాపన చేశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పాయకరావుపేట పిఎసిఎస్ ఛైర్మన్ దేవవరపు రాజుబాబు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు దేవవరపు రఘు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరెడ్డి చిట్టిబాబు, జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జి గెడ్డం బుజ్జి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్ (పద్దు), పట్టణ శాఖ అధ్యక్షులు యాళ్ల వరహాలబాబు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొందు కాశీ విశ్వనాథ్, క్లస్టర్ ఇంచార్జి వంకా రమణ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఎగదాసు నానాజీ, తెలుగుదేశం పార్టీ పాల్తేరు గ్రామ శాఖ అధ్యక్షులు కొంకుపూడి రమేష్, ఎంపీటీసీ సభ్యులు మాకినీడి చిట్టిబాబు, పార్టీ సీనియర్ నాయకులు అనిశెట్టి వెంకటసూరి (శ్రీను), జనసేన పార్టీ సీనియర్ నాయకులు అక్కిరెడ్డి వరహాలు, ఉప సర్పంచ్ దేవవరపు శివరాజు, మాజీ ఉప సర్పంచ్ రాంబాబు, సుబ్రమణ్యం,



బుద్దాల శ్రీను, ఇసరపు తాతారావు, మాకినీడి సత్తిబాబు, ఘనశాల గంగేశ్వరరావు, ముద్దాల వీరబాబు, పెదకాపు గోపి, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "రెడ్ రిబ్బన్ క్లబ్" ఆధ్వర్యంలో ఉమెన్ ఎంపవర్మెంట్ పై అవగాహన కార్యక్రమం

**నీలగిరి వార్త.**

తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "రెడ్ రిబ్బన్ క్లబ్" ఆధ్వర్యంలో శుక్రవారం ఉమెన్ ఎంపవర్మెంట్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆడపిల్లల్లో సమతుల్య ఆహారం తీసుకోకపోవడం వలన వచ్చే పౌష్టికాహార లోపాలు, నివారణ చర్యలు గురించి ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ లలిత మాట్లాడుతూ... ఆడపిల్లలు సమతుల్య ఆహారం తీసుకుని ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని విద్యార్థినులకు తెలియజేశారు. అనంతరం "రెడ్ రిబ్బన్ క్లబ్" ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్లపురం జి.హెచ్.డి.డాక్టర్. ఎమ్. వెంకటలక్ష్మి, అల్లిపూడి జి.హెచ్.డి.డాక్టర్. సత్యవేణి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి వారి సమస్యలకు చక్కని పరిష్కారాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థుల కోసం ఉచిత హోమియో శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థులకు మెడికల్ చెక్ అప్ చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ అలీన.పి.వి.కె.ఎమ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. దివాకర్, ఎం శ్రీనివాస్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే ఏలూరి కృషి ఫలితం

**పర్చూరుకు 90 టన్నుల పశువుల దాణా మంజూరు**

**తీవ్ర వర్షాభావ నేపథ్యంలో పశు పోషకులకు ఊరట**

**పశుసంపద పరిరక్షణకు ప్రాధాన్యం.. రైతులకు అండ**

**నియోజకవర్గ పశుపోషకుల సంక్షేమానికి మరో ముందడుగు**

**నీలగిరి వార్త.**

పల్లెల్లో పశువంటే కేవలం ఆదాయ వనరు కాదు, ఇంట్లో మనిషితో సమానం. తెల్లవారుజామున పాలధారై, కష్టకాలంలో కుటుంబానికి ఆసరాగా నిలిచే ఆ మూగజీవాలు ఆకలితో అలమటిస్తుంటే రైతు గుండె తల్లడిల్లుతుంది. వానలు కరవై, కరవు ఛాయలు అలుముకున్న ఈ వేళ.. అలాంటి పశు పోషకులకు ఊరటనిస్తూ కూటమి సర్కార్ పర్చూరు నియోజకవర్గానికి అదనంగా 90 టన్నుల పశువుల దాణా మంజూరు చేసింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ కేటాయింపు చేసింది.ఎల్నినో ప్రభావ,పరిస్థితుల్లో ఇది పశు పోషకులకు ఎంతగానో ఉపయోగపడనుంది.

వర్షాభావంతో తీవ్రమైన దాణా కొరతనియోజకవర్గంలో అత్యధికులు పశు సంపద ద్వారా వచ్చే ఆదాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే వర్షాలు కురవకపోవడం, ఇటీవలి పర్యావరణ, ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో నాణ్యమైన దాణా, పచ్చిమేత కొరత తీవ్రమైంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న దాణా పశువుల పోషకాహార అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. సరైన పోషణ లేక పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతోంది. పాడి పశువుల్లో ఆరోగ్య సమస్యలు పెరగడమే కాకుండా, వ్యాధుల బారిన పడే ప్రమాదమూ అధికమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం పశుపోషకుల జీవనోపాధికి ఊతమివ్వనుంది.మంత్రికి ఎమ్మెల్యే లేఖ.. వెంటనే స్పందన ఎల్నినో ప్రభావం, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు లేఖ రాశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలైన మార్టూరు, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం, యద్దనపూడిలకు ఒక్కో మండలానికి 15 టన్నుల చొప్పున మొత్తం 90 టన్నుల అదనపు దాణా మంజూరు చేయాలని కోరారు. దీనిపై మంత్రి వెంటనే స్పందించి అదనపు దాణాను మంజూరు చేశారు. పశు సంపద పరిరక్షణకు ప్రాధాన్యం కరవు పరిస్థితుల్లో పశువులను కాపాడుకోవడం రైతులకు సవాలుగా మారిన తరుణంలో, ఈ దాణా మంజూరు వారికి పెద్ద ఆసరాగా నిలవనుంది. పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు పాల ఉత్పత్తి పెరిగి, పశుపోషకులకు గణనీయమైన ఊరట లభించనుంది. పాడి రైతు నిలబడితేనే పల్లె ఆర్థిక వ్యవస్థ నిలబడుతుందన్న నమ్మకంతో, పశుపోషకుల ప్రయోజనాలే



లక్ష్యంగా, రైతన్నకు అండగా ఎమ్మెల్యే ఏలూరి చేసిన ఈ కృషి నియోజకవర్గ పశుపోషకుల సంక్షేమానికి మరో ముందడుగుగా నిలిచింది.దాణా మంజూరు పట్ల పశు పోషకులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరుతడి పంటగా మినుము సాగు

**రైతులకు 80 శాతం సబ్సిడీపై మినుములు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య**

**నీలగిరి వార్త.**

ఈరోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులకు 80 శాతం సబ్సిడీపై మినుములను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రారంభించారు. ఈరోజు నుండి రైతు సేవా కేంద్రాల్లో 80 శాతం సబ్సిడీపై మినుము విత్తనాలు రైతులకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.ఎల్నినో ప్రభావంతో ఖరీఫ్‌లో పంట సాగు చేయని రైతులు ప్రత్యామ్నాయ ఆరుతడి పంటగా మినుము సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. చీరాల వేటపాలెం మండలానికి 412 క్వింటాళ్ల మినుము విత్తనాలు సరఫరా చేసినట్లు తెలిపారు.కిలో విత్తనం పూర్తి ధర రూ.129.50 కాగా, ప్రభుత్వం రూ.103.60 సబ్సిడీ అందిస్తుందని,రైతు వాటాగా కేవలం రూ.25.90 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మినుము సాగు చేయదలచిన రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాన్ని ఆధార్ కార్డు,పట్టాదార్ పాస్ పుస్తకంతో సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ కౌతరపు జనార్ధన్, వ్యవసాయ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు




# శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా దసరా సంబరాలు

**నీలగిరి వార్త.:**

పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో శుక్రవారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విజయదశమి పండుగ విశిష్టత, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు అమ్మవారి వివిధ రూపాలను ప్రతిబింబించేలా సంప్రదాయ వేషధారణలో అందంగా ముస్తాబై, అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో అలరించారు. చిన్నారుల నృత్యాలు, ఆటపాటలు పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నింపాయి..ఈ వేడుకల్లో భాగంగా ప్రీప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులు వివిధ రకాల బొమ్మలను తీసుకువచ్చి అందంగా ప్రదర్శించడంతో బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ పద్ధతిలో బొమ్మలను అలంకరించి ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. చిన్నారుల్లో సృజనాత్మకతను, భారతీయ సంస్కృతి పట్ల ఆసక్తిని పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎజిఎం ఎంవి సురేష్, ఆర్ఐ పి గోపీనాథ్, మాట్లాడుతూ... పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ తమలోని ప్రతిభను వెలికితీయాలని తెలిపారు. ప్రిన్సిపల్



పి రామరాజు మాట్లాడుతూ... విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులు తెలుసుకొని వాటిని గౌరవించాలన్నారు.

## ఎంపి గొల్ల బాబూరావును ఘనంగా సత్కరించిన హిందుస్థాన్ షిప్ యార్డ్ సిఎండిఓ చంద్రశేఖరన్ రఘురాం

**నీలగిరి వార్త.:**

పార్లమెంట్ సభ్యులు (రాజ్యసభ) గొల్ల బాబూరావు ఇటీవల పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ మెంబరుగా నియమితులైన సందర్భంగా హిందుస్తాన్ షిప్ యార్డ్ సిఎండిఒ చంద్రశేఖరన్ రఘురాం విశాఖపట్నంలోని గొల్ల బాబూరావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాబూరావుకు శాలువా కప్పి సత్కరించారు. పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. తనను ఘనంగా సత్కరించిన హిందుస్తాన్ షిప్ యార్డ్ సిఎండిఒ చంద్రశేఖరన్ రఘురాంకు గొల్ల బాబూరావు కృతజ్ఞతలు తెలియజేశారు.



# రైతులు హలాన్ని పట్టుకోవాలి అర్జీలు కాదు

**రాజముద్రతో భూమికి భరోసా కల్పించాం**

**ఇప్పటికి 40.58 లక్షల పాస్ పుస్తకాల పంపిణీ**

**16.48 లక్షల ఎకరాలు 22ఏ జాబితా నుంచి తొలగింపు**

**కొండపిలో 2,915 ఎకరాల గర్భకండ్రిక భూ సమస్యల పరిష్కారం**

**ప్రకాశం జిల్లా మీ భూమి-మీహక్కు బహిరంగ సభలో సీఎం చంద్రబాబు**

**రూ.166 కోట్లతో పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన**

**నీలగిరి వార్త.**

రైతులు హలం పట్టుకుని పొలానికి వెళ్లాలే తప్ప.. భూమి సమస్యల పరిష్కారం కోసం అర్జీలు పట్టుకుని అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భూమి రైతుదేనని, దానిపై హక్కు కూడా రైతుదేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో హక్కులను పరిరక్షించేందుకు రీసర్వే ప్రక్రియను చేపట్టామని తెలిపారు. రీసర్వే 2.0 అనంతరం రాజముద్రతో కూడిన పటిష్టమైన భద్రతా ఫీచర్లతో కూడిన పట్టా దారు పాస్ పుస్తకాలనుపుస్తకాలను --మీ హక్కు' గ్రామసభలో ఆయన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. గత పాలనలో భూములకు భద్రత లేకుండా పోయిందని, ఆక్రమణలు, దందాలు, భూ వివాదాలతో రెవెన్యూ వ్యవస్థను దెబ్బతీశారని ముఖ్యమంత్రి విమర్శించారు. ప్రజల ఆస్తులపై ఫొటోలు వేసుకుని, సర్వే రాళ్లపై రాజకీయ నాయకుల బొమ్మలు పెట్టారని వ్యాఖ్యానించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో భూములపై వివాదాలు సృష్టించారని, అందుకే ఆ చట్టాన్ని రద్దు చేశామని తెలిపారు. గతంలో రాజకీయంగా వ్యతిరేకంగా ఉన్నవారి భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 16.48 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించామని వెల్లడించారు. కంగుంది, అమలాపురం, శెట్టిపల్లి తదితర ప్రాంతాల్లో వివాదాల్లో ఉన్న 41 వేల ఎకరాలకు విముక్తి కల్పించామని చెప్పారు. ప్రకాశం జిల్లాలో నాలుగు మండలాల్లోని 2,315 ఎకరాల గర్భ కండ్రిక భూముల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని వివరించారు. పట్టా దారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించేందుకే ప్రతినెలా ప్రజల ముందుకు వస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమం సక్రమంగా పూర్తయ్యేంత వరకూ రైతుల వద్దకు వస్తూనే ఉంటానని చెప్పారు. రాష్ట్రంలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే తాను స్వయంగా పాస్ పుస్తకదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశావఅవకోట్లతో రెండేళ్లలో పనులు పూర్తి చేస్తావచారు. పొన్నలూరు మండలం వేమూరుపాడు రహదారి, పాలేరు నదిపై వంతెన నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశామని తెలిపారు. రూ.28 కోట్లతో ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకొచ్చామని చంద్రబాబు చెప్పారు. ఆ ప్రాజెక్టు రెండో దశను కూడా పూర్తిచేసి అన్ని ప్రాంతాలకు సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. నీరు అందుబాటులోకి రాకుండానే రిబ్బన్లు కట్ చేయడం, ప్రాజెక్టులను జాతికి అంకితం చేసినట్లు ప్రచారం చేసుకోవడం తమ విధానం కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని 40 చిన్నా పెద్ద నదులను అనుసంధానించి నీటి గ్రిడ్‌ను ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వంశధార నుంచి పెన్నా వరకు నదుల అనుసంధానం జరిగితే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు నీటిని అందించవచ్చన్నారు. గోదావరి నుంచి కావేరి వరకు అనుసంధానం జరిగితే నాలుగు రాష్ట్రాల్లో నీటి కొరతను అధిగమించే అవకాశం ఉంటుందని చెప్పారు. రూ.35 వేల కోట్లతో రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. భూగర్భ జలాల పెంపునకు కూడా పెద్దఎత్తున చర్యలు చేపడుతున్నామని తెలిపారు.గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌తో ప్రకాశం అభివృద్ధి ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలను ప్రపంచ స్థాయి ఉద్యానవన పంటల కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రారంభించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పల్లె పండుగ ద్వారా రూ.11 వేల కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, మంగళగిా ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల న్నామని వెల్లడించారు. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా అమరజీవి జలధార కింద రూ.31 వేల కోట్లతో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించేలా రేషన్ రూ.1.5 లక్షల కోట్లతో రిఫైనరీ ఏర్పాటు చేస్తోందని సీఎం వెల్లడించారు. రామాయపట్నం పోర్టు గతంలోనే పూర్తి కావాల్సి ఉన్నా నిర్లక్ష్యానికి గురైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను వేగవంతం చేసి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.బీసీలకు పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిర్ణయానికి సంబంధించి స్పందించిన ముఖ్యమంత్రి.. పార్టీ పరంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తామని ప్రకటించారు. టీడీపీకి బీసీలు వెన్నెముక అని, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి పార్టీ ఎప్పుడూ కృషి చేసిందని చెప్పారు. గతంలో తాము తీసుకొచ్చిన 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా గొడ్డలి పార్టీ అడ్డంకులు సృష్టించిందని వాటిని 24 శాతానికి తగ్గించడం వల్ల అనేకమంది నష్టపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అయితే న్యాయస్థానాల తీర్పులతో ఆ రిజర్వేషన్ల అమలుకు ఋఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఓటమి తప్పదనే సర్ పేరిట స్థానిక ఎన్నికలను కూడా అడ్డుకోవాలన్న ఆలోచనతోనే గొడ్డలి పార్టీ కోర్టులకు వెళ్లిందని సీఎం ఆక్షేపించారు ప్రజాభిప్రాయం ఆధారంగా పాలనలో మార్పులు ప్రజల బాగోగులే కూటమి ప్రభుత్వానికి ముఖ్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేవుడిని ప్రార్థించే సమయంలో కుటుంబానికి మంచి జరగాలని కోరుకోవడంతో పాటు, ప్రజలకు మేలు చేసే ప్రభుత్వ పనితీరుపైనా ఆలోచన చేయాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాలను ఫోన్ ద్వారా నేరుగా తెలుసుకుని తెలిపారదర్శకతను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగ సామర్థ్యాలను మరింత పెంచి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాల శ్రీవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

**నరసింగోలులో 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమం.. పాల్గొన్న పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు**

**నీలగిరి వార్త.**

ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం, జరుగుమల్లి మండలం, నరసింగోలు గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.అలాగే జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జిల్లా పోలీసు అధికారి హర్షవర్ధన్‌రాజు, ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్‌రావు, రాష్ట్ర సముద్ర తీర మండలి చైర్మన్ దామచర్ల సత్య, కనిగిరి శాసనసభ్యుడు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరయ్యారు.వీరితోపాటు జిల్లాకు చెందిన పలువురు శాసనసభ్యులు, వివిధ సంస్థల చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




Printed, Published and Owned by GUNTOJ VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No. 08, Shiva Shankar Colony, Kuntloor, (V) Abdulpurmet (M), Ranga Reddy District, Telangana. Published at V.M. PUBLICATIONS Plot No. 08, Shiva Shankar Colony, Kuntloor, (V) Abdulpurmet (M), Ranga Reddy District, Telangana State. Pin:501505, Editor, GUNTOJ VISHNU MURTHY, RNI NO: APTEL/31957/2009:Cell No: 9676549223.